క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రామ్‌చరణ్

అడ్డతీగల: ట్రిపుల్ ఐటికి అడ్డతీగల గురుకుల పాఠశాలలో చదివిన పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. 2024–25 విద్యా సంవత్సరంలో 576 మార్కులు సాధించిన యాట్ల ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నూజివీడు ట్రిపుల్ ఐటీకి, 566 మార్కులు పొందిన సాధించిన బిత్తరి రామ్‌చరణ్‌కి మన్యం పార్వతీపురం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కి ఎంపికైనట్టు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ తెలిపారు. ఆయా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

28న వైఎస్సార్‌సీపీ మండల సమావేశం

ఎటపాక: వైఎస్సార్‌సీపీ మండల సమావేశం ఈనెల 28న నిర్వహిస్తున్నట్టు నాయకులు బుధవారం తెలిపారు. మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో శనివారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఎదుర్కుంటున్న సమస్యలు, ఇబ్బందుల, స్థానిక సమస్యలపై చర్చించనున్నట్టు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

పెదబయలు: మండలంలోని మహిళా సర్పంచ్‌లకు ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాడేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి శిక్షణ ఉంటుందని, మండలంలోని 12 మంది మహిళా సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు. పంచాయతీ రాజ్ చట్టం, పరిపాలన విషయాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. మహిళా సర్పంచులు విధిగా హాజరు కావాలని కోరారు.

జూలై 3 నుంచి 5వరకు శిక్షణ

గూడెంకొత్తవీధి: మండలంలో ఎనిమిది మంది మహిళా సర్పంచ్‌లకు జూలై మూడు నుంచి ఐదు వరకు నర్సీపట్నం ఎంపీడీవో కార్యాలయంలో పాలన అంశాలకు సంబంధించిన విషయాలపై శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో ఉమామహేశ్వరరావు బుధవారం తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణకు వారంతా విధిగా హాజరు కావాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బోరు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: మండలంలోని దామనాపల్లిలో బోరు ఏర్పాటుకు సర్పంచ్ కె.రామకృష్ణ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీపీ బోయిన కుమారి, ఎంపీటీసీ భీమరాజు చొరవతో గ్రామంలో బోరు ఏర్పాటుకు నిధులు మంజూరైనట్టు తెలిపారు. ఈ ప్రాంతంలో సంవత్సరాలుగా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.ఇప్పుడు బోరు మంజూరు కావడంతో సమస్య తీరుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అహల్యాబాయి హోల్కర్‌కు ఘన నివాళి



మాట్లాడుతున్న నాయకుడు రామారావు

వి.ఆర్.పురం: ప్రముఖ సంఘ సేవకురాలు అహల్యాబాయి హోల్కర్ జయంతి కార్యక్రమన్ని మండలంలోని గుర్రంపేట గ్రామంలో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు నోముల వెంకట రామారావు మాట్లాడుతూ మాల్వా సామ్రాజ్య వంశపు రాణి, రాజమాతగా అహల్యాబాయి ప్రజలకు విశేష సేవలందిస్తూ, సుభిక్షంగా పాలన అందించి, దేశవ్యాప్తంగా వేలాది ఆలయాలను పునరుద్ధరించి మరాఠీ రాజ్యపాలన చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని గుర్తు చేశారు. నాయకులు వెంకయ్య, సత్యనారాయణ, పవన్ కుమార్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారులతో అవస్థలు



గంగవరం- కుసుమరాయి రహదారి దుస్థితి



చిత్తడిగా దర్శనమిస్తున్న కుసుమరాయి గ్రామ ప్రధాన రహదారి

- రాళ్లుతేలిన రహదారులు
- వర్షాలతో మరింత అధ్వానంగా మారిన వైనం
- రాకపోకలకు గ్రామస్తుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

గంగవరం: మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. రాళ్లు తేలి, పెద్ద పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వాన్నంగా రహదారులు మారాయి. గంగవరం – కొమరవరం రహదారి చాలా కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో కుసుమరాయి, కొమరవరం గ్రామాల గిరిజన ప్రజలు రాకపోకలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కుసుమరాయి గ్రామం నుంచి కొమరవరం వెళ్లే రహదారి రాళ్లు తేలి దారుణంగా ఉంది. ఈ రహదారి సరిగ్గా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కుసుమరాయి, కొమవరం గ్రామాల వైపు ఉన్న గ్రామాల నుంచి గిరిజనులు మండల కేంద్రానికి రావాలంటే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అత్యవసర సేవలకు ఆటంకం

మండలంలోని కుసుమరాయి, కొమవరం, మర్రిపాలెం, రంపచోడవరం మండలం చుప్పరపాలెం, నల్లగొండ తదితర గ్రామస్తులు ఈ రహదారి మీదుగానే మండల కేంద్రం గంగవరం చేరుకుంటారు. గోకవరం, రాజమండ్రి, అడ్డతీగల వైపు ప్రయాణించాలంటే ఈ రోడ్డు మార్గనే రాకపోకలు సాగిస్తుంటారు. రహదారి రాళ్లు లేచిపోయి, గ్రావెల్ కొట్టుకుపోయి గోతులు మయంగా ఈ రహదారి తయారైంది. కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లేలేని పరిస్థితి నెలకొంది. రహదారి సరిగ్గా లేక గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర వైద్య సేవలందించే అంబులెన్స్ డ్రైవర్లు ఈ మార్గంలో వచ్చేందుకు నిరాకరిస్తున్నారని, దీంతో రోగులకు సకాలంలో వైద్య సేవలందడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా రోగులు, గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా మారిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో వై.లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలోని అధ్వానంగా ఉన్న రహదారుల మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపుతామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



మండల కేంద్రానికి గాని, డివిజన్ కేంద్రానికి గాని వెళ్లాంటే ఈ రహదారే ప్రధాన మార్గం. ప్రభుత్వం ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అత్యవసర సమయాల్లో నానా అవస్థలు ఎదుర్కొంటున్నాం. ద్విచక్ర వాహనంలో కూడా ఈ రహదారిలో ప్రయాణించలేకపోతున్నాం. ఈ రహదారిని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గొల్లపల్లి నాగభూషణం, కుసుమరాయి, గంగవరం మండలం

సమస్య పరిష్కరించాలి



ఈ రహదారి బాగోలేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రాత్రిళ్లు ఈ మార్గంలో ప్రయాణించాలంటే చాలా భయం వేస్తుంది. రహదారి అంతా గోతులు మయంగా ఉంది. వర్షం పడితే చాలా ఈ రహదారి అంతా చెరువుగా మారిపోతుంది. ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి.

– తాము బాపిరాజు, కుసుమరాయి, గంగవరం మండలం

అధికారుల దృష్టికి సమస్య



మండలంలో పలు రహదారుల సమస్యలను అధికారులు దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. ఐటిడిఏ అధికారులకు రహదారుల సమస్యను విన్నవించాం. రహదారులఅభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు.

– పల్లాల కృష్ణారెడ్డి, ఎంపీపీ, గంగవరం

నేడు మెగా రక్తదాన శిబిరం



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌బీఐ మండల యూనియన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు

అరకులోయటౌన్: మండల కేంద్రంలోని ఏరియా ఆస్పత్రిలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఎస్‌బీఐ మండల యూనియన్ కార్యదర్శి అరుణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంలను ఆహ్వానించినట్టు తెలిపారు. ఈ రక్తదాన శిబిరానికి అన్ని వర్గాల ప్రజలు, యువత తరలివచ్చి విజయవంతం చేయాలని అరుణ్‌కుమార్ కోరారు.

ఆలయ అభివృద్ధికి కృషి



అమ్మవారికి పూజలు చేస్తున్న శ్రీనివాసరావు

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఉన్న నాగమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని విశ్వ హిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అన్న సమారాధనకు విరాళం అందజేశారు. దేశం, ధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా ముందుకు రావాలన్నారు. ధర్మరాజు, నానాజీ, రాంబాబు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వీధిలైట్లు పంపిణీ



సర్పంచ్‌లు, కార్యదర్శులకు వీధిలైట్లు పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

పెదబయలు: మండలంలోని అన్ని పంచాయతీలకు అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ఎంపీ లాడ్స్ నుంచి మంజూరైన వీధిలైట్లను ఎంపీ ఆదేశాల మేరకు పంపిణీ చేయనున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగిన పంపిణీ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు 280 ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్లు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు అందించినట్టు తెలిపారు. మండలంలో కూడలి ప్రదేశంలో సోలార్ లైట్లు కూడా త్వరలో అమర్చనున్నట్టు చెప్పారు. పెదబయలు మండలం అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నారన్నారు. గిన్నెలకోట, జామిగుడ పంచాయతీల సరిహద్దు పిట్టలబొర్ర(తారాబు) జలపాతం సుందరీకరణకు ఎంపీ నిధులు రూ.4 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. మండలంలో సుమారు రూ.7 కోట్లతో అభివృద్ధి పనులకు ఎంపీ నిధులు మంజూరైనట్టు చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరగుతుందన్నారు. తహసీల్దార్ జి. రంగారావు, వైస్ ఎంపీపీ కొర్ర రాజుబాబు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్, మాజీ ఎంపీపీలు జర్సింగి సూర్యనారాయణ. సల్లంగి ఉమామహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీలు సూర్యనారాయణ, గంగాభవాని, రాష్ట్ర అగ్రో మాజీ డైరెక్టర్ వి.సన్యాసి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు వంతాల ఆనందరావు, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈ కృష్ణారావు

అరకులోయటౌన్: మండలంలోని పీఎం జన్‌మన్ హౌసింగ్ లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో బిల్లులకు సంబంధించి నగదు జమ చేసినట్టు హౌసింగ్ పీడీ బాబు, డీఈఈ రాజబాబు తెలిపారని ఏఈ కాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహాలు వివిధ దశల్లో నిర్మించుకున్న పీవీటిజి లబ్ధిదారులు గత కొన్ని నెలలుగా బిల్లుల కోసం ఎదురు చూశారన్నారు. అయితే ఇటీవల లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేశారన్నారు. లబ్ధిదారులు తమ బ్యాంకు ఖాతాలను సరిచూసుకోవాలని, లేని పక్షంలో హౌసింగ్ కార్యాలయంలో పరిశీలించుకోవాలని కాంతి తెలిపారు.

ముంచంగిపుట్టు: గృహ లబ్ధిదారుల ఖాతాలో త్వరలో జన్‌మన్ హౌసింగ్ పెండింగ్ బిల్లులు జమ కానున్నట్టు గృహ నిర్మాణ శాఖ ఏఈ సిహెచ్.కృష్ణారావు అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 350 మంది గృహ లబ్ధిదారులకు రూ.3.30కోట్లు నిధులు విడుదలైనట్టు తెలిపారు. మూడు రోజుల్లో లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయని,గృహ లబ్ధిదారులు సకాలంలో గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని,హౌసింగ్ సిబ్బందికి గృహ నిర్మాణాలలో లబ్ధిదారులు సహకారం అందించాలని,నిర్మాణాల్లో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కృష్ణా,హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

కొయ్యూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు విధిగా పౌష్టికాహారం అందిస్తున్నామని సీడీపీవో ఎల్.దేవమణి తెలిపారు. మారుమూల ప్రాంతాలకు కూడా అవి చేరే విధంగా చూస్తామన్నారు. పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, విధిగా పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. సీడీపీవోగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

దేశ చరిత్రలో మాయనిమచ్చగా ఎమర్జెన్సీ కాలం



చెరువూరులో గ్రామస్తులతో కలిసి మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ బొజ్జిరెడ్డి

రంపచోడవరం: దేశ చరిత్రలో ఎమర్జెన్సీ ఒక చీకటి యుగమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జిరెడ్డి అన్నారు. రంపచోడవరం మండలం చెరువూరు, మారేడుమిల్లి మండలం దారవాడ గ్రామాల్లో బుధవారం గిరిజనులతో కలిసి బ్లాక్‌డే నిరసన కార్యక్రమం నిర్వహించారు. కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ నాటి కాంగ్రెస్ పాలనలో విధించిన ఎమర్జెన్సీ దేశ చరిత్రలో మాయనిమచ్చగా మిగిలిందన్నారు. దేశంలో జూన్ 25ని ఎప్పటికి మరిచిపోలేమన్నారు. నాయకులు సీతారామన్నదొర, కృష్ణారెడ్డి, ప్రతాప్‌దొర, జయలక్ష్మి, వెంకన్న, విశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలకు అధికారుల డుమ్మా



మాట్లాడుతున్న పీసా కమిటీ చైర్మన్ సూరిబాబు

రాజవొమ్మంగి: పీవీటీజీలు నివసించే ప్రాంతాల్లో జరుగుతున్న దర్తి అబ్ జన్‌భగిదరి అభియాన్ గ్రామసభలకు అధికారులు హాజరుకాడం లేదని మండల పీసా కమిటీ చైర్మన్ తాము సూరిబాబు ఆరోపించారు. మండలంలోని లాగరాయి గ్రామంలో బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా ప్రస్తుతం ఎంపిక చేసిన గ్రామాల్లో జరుగుతున్న భగీదరి అభియాన్ గ్రామ సభలకు అన్ని శాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని సూరిబాబు స్థానిక ఎంపీడీఓ యాదగిరీశ్వరరావును కోరారు. దీనిపై ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామ సమావేశాలకు హాజరుకాని అధికారుల వివరాలను ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, సర్పంచ్ గణలక్ష్మి, ఆర్ఐ చెల్లమ్మ, హౌసింగ్ ఏఈ శ్రీనివాస్, గ్రామపెద్దలు, పీసా కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: వ్యవస్థలో పారదర్శకతకు సమాచార హక్కు చట్టం ఎంతో ఉపయోగపడుతుందని మండల వ్యవసాయాశాఖాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. మండలంలోని బంగారుమెట్ట రైతు సేవ కేంద్రంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై గిరిజన రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం వలన కలిగే ప్రయోజనాలను వివరించారు.ఈ సందర్భంగా ఏవో మురళి కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్క పౌరుడు ప్రభుత్వ సమాచారాన్ని పొందేందుకు హక్కును కలిగించారని, అవినీతిని నిరోధించడానికి సహాయపడుతుందని, జవాబుదారీతనం ఉంటుందన్నారు. సర్పంచ్ రత్న, ఎంపీటీసీ సభ్యురాలు కొండమ్మ, వైఎస్సార్‌సీపీ నేతలు జగన్నాథం, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు : పాడేరు విద్యుత్ డివిజన్ పరిధిలోని 33కేవీ పెదబయలు ఫీడర్ మరమ్మతుల నిమిత్తం పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని అన్ని గ్రామాల్లో, 33 కేవీ చింతపల్లి ఫీడర్ మరమ్మతుల నిమిత్తం సప్పర్ల, దారకొండ, కొంగపాకలు, దుప్పిలవాడ గ్రామాల్లో ఈ నెల 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎల్.సీహెచ్.పాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాల వినియోగంతో అనర్థాలు



అరకులోయలో వ్యాసరచన పోటీలో విజేతను సన్మానిస్తున్న సీఐ హిమగిరి తదితరులు



చింతపల్లిలో వ్యాసరచన పోటీ పరీక్షను పర్యవేక్షిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వరరావు, హెచ్ఎం రామరాజుపడాల్



గంగవరంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యార్థులు

అరకులోయటౌన్: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించారు. అరకులోయలోని సీఐ ఎల్.హిమగిరి, ఎస్ఐ గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక దండకారణ్య జూనియర్ కాలేజీలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ ఎం.వి.వి.ప్రసాద్, ఎంపీడీవో అడపలోవరాజు మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు దుర్భరంగా మారుతాయని, వాటికి జోలికి వెళ్లొద్దని సూచించారు. డాక్టర్ ఆదిత్య మాట్లాడుతూ గంజాయి తదితర మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్యాలను వివరించారు. ఎక్సైజ్ ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ యువత గంజాయి స్మగ్లర్ల ప్రలోభాలకు లొంగి నమ్మి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని మహమ్మద్ హలీమా షాహెద్‌కు దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీను, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతపల్లి: అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చింతపల్లిలో గల గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పాఠశాల హెచ్ఎం సాగిన రామరాజు పడాల్, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు ఎస్ఐ బి.వెంకటేష్ వివరించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఎస్.సాయి రమణ అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను ఎస్ఐ సంతోష్‌కుమార్ విద్యార్థులకు వివరించారు. ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ యువత కేరీర్‌పై దృష్టి సారించాలన్నారు. హెడ్ కానిస్టేబుల్ లెనిల్, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు శివప్రసాద్, వెంకటేశ్వర్లు, మురళిదొర, లక్ష్మీయ్య, నరసింహారావు, సత్యనారాయణ, ఎలిసా, శివ తదితరులు పాల్గొన్నారు.



వీఆర్ పురంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సంతోష్ కుమార్

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి



వాసుని సన్మానిస్తున్న ఎంపీ తనూజారాణి

ఎటపాక: వైఎస్సార్‌సీపీ ఎటపాక మండల అధ్యక్షుడు తానికొండ వాసుని అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి బుధవారం సన్మానించారు. ఈ మేరకు వివరాలను వాసు బుధవారం తెలిపారు. పాడేరులో ఎంపీ తనూజరాణిని మర్యాదపూర్వకంగా కలిసి భద్రాచలం రామాలయం ప్రసాదాలు అందజేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని సమస్యలు, పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తున్నందుకు వాసుని శాలువాతో ఎంపీ దంపతులు సన్మానించి అభినందించారు.